


# నీడపొడుగు

వసుధ

"ఊహుఁ నిద్రరావటం లేదు", అంది విమల అభావంగా

"వాళ్ళు కూడా పడుకున్నారా?" అన్నాడు. పక్కగదిలో లైటార్పివేయటం చూసి "ఊఁ" అంది విమల మాట్లాడడం యిష్టంలేనట్లు. గోపాల్ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు

విమల మనసులో ఏదో చెప్పలేని అశాంతి "గిరి వున్నందువల్ల తనకు ఎంతో పని తగ్గింది రోజూ పొద్దున్నే, కూరలూ, కావలసిన సామాన్లు అన్నీ తెచ్చిపెడ్తాడు తనకన్నా ముందే లేచి బాయిలర్ వెలిగిస్తాడు పాపను ఆడించుకుంటాడు అయినా ఎందుకో అసూయ వాడిమీద! ఛి, ఛీ! అలా అనకుండా వుంటే బాగుండేదేమో!" మనసులోనే మథనపడుతూ వుండిపోయింది కాసేపు

విమలలో ఆత్మ పరిశీలన మొదలవగానే ఏదో తప్పు చేశానన్న భావంతో మనసంతా బాధగా అయిపోయింది. కొంచెంసేపు అటూ యిటూ పొర్లి, కొంచెం మంచినీళ్ళు తాగి వద్దామని లేచి వంటింటి వైపు వెళ్ళింది మంచినీళ్ళు తాగి వస్తుంటే గిరి పక్క ఖాళీగా కనిపించింది విమల గుండె గతుక్కుమంది "ఎక్కడికి వెళ్ళాడీ వెధవ?" అనుకుంది వీధి వాకిలి దగ్గరకేసి వుంది విమల మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్ళి చూసింది. యింటి ముందు స్ట్రీట్‌లైట్ వెల్తుర్లో పుస్తకం పట్టుకుని దీక్షగా చదువుతున్న గిరిని చూడగానే విమలకు ఒళ్ళు మండిపోయింది

"వెధవ! ఒక్కమారు కరెంటు ఖర్చు అన్నానని, స్ట్రీట్‌లైట్ కిందకుపోయి చదువుకుంటాడా! ఏం పెద్ద ఐ ఏ ఎస్ ఆఫీసర్ పోస్టుకోసం చదువుతున్నట్లు ఫోజూ వీడూనూ! రేపందరూ చూసి, 'పని కోసమే వాడిని చేరదీసింది, యింట్లో చదువుకోనీయదూ!' అని అనుకోవటానికి ఛ, ఛ! యిలాంటి వెధవలను చేరదీస్తే యింతే, అప్రదిష్ట మిగిలేది!" అనుకుంటూ, విసురుగా లోపలికి వెళ్ళి పడుకుని ముసుగు కప్పుకుంది

"ఏం, నాయనా! రాత్రి కరెంట్ ఖర్చవుతోందని అన్నాగానీ, యింట్లో లైటార్పి వీధిలో కూర్చుని చదువుకోమన్నానా? అర్ధరాత్రిదాకా చదువుకోకపోతే అంతోటి పరీక్ష రాయలేవా?" విసురుగా మాట్లాడుతున్న విమల గొంతు విని, "ఏమిటి విమలా, ఏమయింది, ప్రొద్దున్నే వాడిని విసుక్కుంటున్నావ్?" అన్నాడు గోపాలం లేచి వస్తూ.

"ఏమీ కాలేదు రాత్రి పదిన్నరయింది గదా, యింక లైటార్పిపడుకో, పొద్దున్నే లేచి చదువుకో వచ్చు అన్నానని, బయటకెళ్ళి ఆ స్ట్రీట్ లైట్ కింద చదువుతున్నాడు ఏం లేకపోయినా ఒక్క మాట అంటే పడలేనంత రోషంవుంది వెధవకు" విమల గట్టిగా అరుస్తోంది

"పోనీలే విమలా! అలా స్ట్రీట్ లైట్ కింద చదువుకునే వారే ఎంతో గొప్పవారు అవుతారట" అన్నాడు గోపాలం ఏదో సర్ది చెప్తున్నట్లు

"ఆఁ, మీకేం ఎన్నైనా అంటారు అవమానంతో నా తల వంగిపోతుంటే, మీరు జోక్స్ వేస్తున్నారు రేపందరూ నయ్యాళి, తిండిపెట్టదు, చదవనీయదు, పని మాత్రం చేయించుకుంటుంది అని ఎన్నన్నా, నన్నేగా అంటారు చదువుకోవాలంటే నేనేదో పెద్ద అడ్డమయినట్లు మెల్లగా, చప్పుడు కాకుండా తలుపు తీసి బయటకెళ్ళి చదువుతున్నాడు వెధవ. ఏ అర్ధరాత్రి ఎవరన్నా లోపలదూరినా ఎవరికేం తెలుస్తుంది?" విమల గొంతు తారస్థాయికి చేరుకుంటోంది.

"అది కాదు పిన్నీ! నేను బాగా చదివి ఫస్ట్ క్లాస్‌లో పాసయితే, ఫీజులు లేకుండా కాలేజిలో చేరుస్తానన్నారు హెడ్‌మాస్టారుగారు. అందుకని బాగా చదివి క్లాస్ తెచ్చుకోమని చెప్పారు నిన్న అందుకని రాత్రి కొంచెం ఆలస్యం అయేదాకా లైటువేసి చదువుకున్నాను. బయట లైట్ కూడా బాగానే కనబడుతుంటే అక్కడ కూర్చున్నాను పిన్నీ." గిరి మెల్లగాఅన్నాడు సంజాయిషీయిస్తున్న ముద్దాయిలా

"ఆహాఁ, అంత బాగా కనబడితే అక్కడే చదువుకో రోజూ! నీకిక మా యిల్లు ఎందుకు? నిన్ను చేరదీసినందుకు నాకెందుకు చెడ్డ పేరు చదువుకోనీయటం లేదని! అలాగే ఎంతసేపు కావాలంటే అంతసేపు చదువుకో!" విసురుగా అంది.

గిరి దెబ్బ తిన్నట్లు చూశాడు

"నేను అలా అనలేదు పిన్నీ! యికనుంచీ రోజూ రాత్రి పదిదాకానే చదువుకుంటాన్లే పిన్నీ!" అన్నాడు మెల్లగా

"నన్నేదో వుద్ధరిస్తున్నట్లు చెప్తావేం! పదిదాకా ఎందుకు, నీ యిష్టం వచ్చినంతసేపు, నీ యిష్టం వచ్చినచోట చదువుకో!" విమల మాటలు ఆపకుండానే గోపాల్, "అబ్బ, పోనీ విమలా! యిప్పుడేమయిందని యింత రాద్ధాంతం చేస్తావు?" అన్నాడు

విమల యింకేమయినా తిడ్తే, గిరి వెళ్ళిపోతాడేమోనని భయం అతనికి. గిరి వుంటే బాయిలర్ పనీ, బజారుపనీ అంతా అతనే చూసుకుంటాడు.

''వూరుకుంటానండీ ! ఎందుకూరుకోనూ ? అయినా నేనేం అన్నానని, వాడలా అందరికీ చెప్పకనే తెలిసేట్టు, పగలూరాత్రీ అక్కడ కూర్చుని చదువుకోవాలా ? వాడిని యింట్లోనే కూర్చుని చదువుకోరా అని బ్రతిమిలాడాల్సిన అవసరం నాకేం లేదు పొమ్మనండి ఎక్కడికయినా !'' విమల విసురుగా లోపలికెళ్ళిపోయింది

గోపాల్ మౌనంగా బ్రష్‌తీసుకుని బాత్రూంలో దూరాడు విమల కంత కోపం ఎందుకు రావాలో అతనికి అర్థం కాలేదు కానీ ఆ మాటే పైకి అంటే విమల కోపం తనమీదకు తిరుగుతుందనె భయంతో నోట్లో బ్రష్ దూర్చాడు

''పిన్నీ ! నేను నిన్ను అవమానించాలని ఎయట చదువుకోలేదు నాకు స్ట్రీట్ లైట్ వెలుగులో చదువుకోవటం కొత్తగాదు బజార్లో చదువుకోవటం, అక్కడే నిద్రపోవటం నాకు అలవాటే ! యిక్కడవుండి, నిన్ను కష్టపెట్టే కన్నా నేను నా పాతచోటికే వెళ్తాను'' గిరి ఈ మాటలు విమలకు చెప్పాలనుకున్నాడు గబగబా తన సంచీలో తన రెండు చొక్కాలూ, నిక్కర్లు, పుస్తకాలూ పెట్టుకుని, ''నేను వెళ్తాను పిన్నీ !'' అన్నాడు విమల వంటింట్లోంచి బయటికిరాలేదు 'వుండమని బ్రతిమిలాడాలేమో వెధవని !'' అనుకుని, మూతి తిప్పుకుంది నిజంగా వాడు అంతపనీ చేస్తాడని అనుకోని విమల అవమానంతో

## కవితకోసం !

కవిత కోసం కష్టాలను భరిస్తాను
శతకోటి సుఖాలను చవిచూస్తాను
ప్రతి క్షణం రసోన్ముఖంగా గడవాలని
ప్రయాసల బృహత్కార్యం చేస్తాను
ఆకలేసే అన్నం తిన్న ఆనందంకంటే
రతిక్రీడ రమ్యతకంటే
కవిత పడితే వ్యక్తపరచలేని
ఆనందాన్ని అనుభవిస్తాను
కవిత కోసం ఎన్ని
కష్టాలైనా భరిస్తాను

— జి. శ్రీశైలం

# నీడ పొడుగు

రగిలిపోయింది

''వెధవ పోతాడట పోనీ ! ఆకలి మండితే వాడే వస్తాడు తిండీ, గుడ్డా అన్నీ అమరితే యిలాగే తల తిరుగుతుంది అడ్డమయిన వెధవలకీ !'' విసుక్కుంటూ గోపాలం కాఫీ గ్లాస్ అక్కడ పెట్టేసి, లోపలికి వెళ్ళిపోయింది

* * *

సాయంత్రం, రేయిలో సంధి సంతకం చెయ్యటం దేమో అన్నట్లు ఆకాశం అంతా నల్లని చీకటితో నిండిపోయింది

గిరి వెళ్ళిపోయాడు ఆటలకు వెళ్ళిన రవి యింకా రాలేదు విమల కిటికీలోంచి బయటకు చూస్తూ నిలుచుంది

స్ట్రీట్ లైట్ కింద నుంచి ఎవరో వెళ్తున్నారు దూరంగా నిలబడినపుడు మన వెనక ఎలచే నీడ, దీపం కిందకు రాగానే మన ముందుకు పరుచుకుంటోంది దీపం వెలుగు వెనక్కి వెళ్ళే కొద్దీ, నీడ పొడుగు పెరిగిపోయి, మనిషినే మింగే టట్లు ముందుకు పోతోంది అదే చూస్తున్న విమల మనసులో ఏదో కసిరేసింది ''ఆ వెధవ కూడా యీ నీడ లాగే ఒదిగి ఒదిగి వచ్చి, నన్నే మించి, అవమానించి పోయాడు'' కసిగా అనుకుంది విమల గుండెలో ఏదో కసి ఎవరినో, ఏదో చేసేయాలన్న ఆవేశం పెరట్లోకి వెళ్ళి చిన్నరాయి తీసుకువచ్చింది

చీకటి చిక్కగా ముసురుకుంది వీధిలో సంచారం లేదు ఆ చీకటిలో … ఆ మౌనంలో విమల గురిచూసి విసిరింది రాయిని

''యిక వెలుగులేదూ, నీడాలేదూ'' అంటూ భళ్ళున్న శబ్దం చేస్తూ, పగిలింది దీపం

విమల నుదిటి మీది చిరుబిందువులు మెరిసి, వెలుగుతోపాటే జారిపోయాయి ★